RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 109 | మే 11 సోమవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 109 | May 11 Monday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


మోడీ సభలో పారిశుద్ధ కార్మికులకు నిరాశ 2

# వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

## సికింద్రబాద్ పరేడ్ గ్రౌండ్ సభలో ప్రధానమంత్రి మోడీ



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కోసం కార్యకర్తలు పెద్ద ఎత్తున పెయింటింగ్స్ తీసుకురాగా.. వాటిని సేకరించాలని సెక్యూరిటీకి ప్రధాని ఆదేశించారు. పెయింటింగ్స్ వేసిన చిత్రకళాకారులకు లేఖలు రాస్తానని ప్రధాని తెలిపారు. అనంతరం నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా అంటూ మోదీ తెలుగులోనే ప్రసంగం ప్రారంభించారు. ప్రియమైన తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం..
పశ్చిమ బెంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేశారన్నారు. బెంగాల్‌లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిందని చెప్పారు. ప్రజలు ఈ విజయాన్ని చేకూర్చారన్నారు. బెంగాల్ ప్రజలు చేసిన ప్రతిజ్ఞ ప్రకారం బీజేపీని గెలిపించుకున్నారని, తెలంగాణ ప్రజల నుంచి అలాంటి ఉత్సాహమే కనిపిస్తోందన్నారు. తెలంగాణలో ఈసారి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. బెంగాల్ ప్రజలు ఆశీర్వదించినట్లుగానే తెలంగాణలోనూ ఆశీర్వదించాలని కోరారు. బెంగాల్‌లో గెలిచామని, తర్వాత బీజేపీ లక్ష్యం తెలంగాణేనన్నారు. ఇక్కడి కార్యకర్తల్లో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోందని, తెలంగాణలోనూ అబ్ కీ బార్ మోదీ సర్కార్ నినాదం వినిపిస్తోందన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కానీ, ఆ ఫలితంపై ప్రపంచమంతా చర్చ జరిగిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ పార్టీలే..
పశ్చిమ బెంగాల్‌లో ఓడిపోయింది రాజకీయ పార్టీ కాదని, రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఓడాయన్నారు. అవినీతి, కుటుంబ పార్టీలను ప్రజలు ఓడించారని వ్యాఖ్యానించారు. ప్రజల కళ్లలో నాపై ప్రేమ కనిపిస్తోందన్న ప్రధాని.. ఇదంతా తన అదృష్టమని, సౌభాగ్యమన్నారు. దేశం మొత్తం మార్పును కోరుకుంటోందని, ఏ రాష్ట్రంలోనూ కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవడం లేదన్నారు.

➢ మిగతా 2వ పేజిలో..

# చంద్రబాబు నివాసానికి మోడీ



**హైదరాబాద్ జనసంఘర్షణ**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో ఆదివారం సాయంత్రం ఒక అరుదైన, ఆత్మీయ కలయిక చోటుచేసుకుంది. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చంద్రబాబు ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి విచ్చేసి ఆతిథ్యం స్వీకరించారు. ఈ పర్యటనకు సంబంధించిన విశేషాలను, తన ఆనందాన్ని చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

చంద్రబాబు నివాసంలో ప్రధాని మోదీ సందడి
ప్రధాని మోదీకి చంద్రబాబు నాయుడు , ఆయన కుటుంబ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. సుమారు గంటా పది నిమిషాల పాటు చంద్రబాబు నివాసంలో గడిపిన ప్రధాని, కుటుంబ సభ్యులతో ఎంతో కలివిడిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఇంట్లోని సీతారాముల విగ్రహాలకు మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా, చదరంగంలో ప్రతిభ కనబరుస్తున్న నారా లోకేష్ తనయుడు దేవాన్ష్‌ను ప్రధాని ప్రత్యేకంగా అభినందించడం అందరినీ ఆకట్టుకుంది. ప్రధాని రాకపై చంద్రబాబు స్పందిస్తూ.. "ఈ సాయంత్రం మా కుటుంబం ఎప్పటికీ గుర్తుంచుకోదగిన ఒక మధురానుభూతిని మిగిల్చింది" అని పేర్కొన్నారు.

➢ మిగతా 2వ పేజిలో..

# తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం



**చెన్నై జనసంఘర్షణ**
ముఖ్యమంత్రిగా సినీ నటుడు చంద్రశేఖర్ జోసెఫ్ విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో విజయ్‌తో గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ సీఎంగా విజయ్‌తో ప్రమాణం చేయించారు. ఆయనతోపాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.విజయ్ ప్రమాణస్వీకారోత్సవానికి కాంగ్రెస్? అగ్రనేత రాహుల్?గాంధీ, విజయ్ తల్లిదండ్రులు, రాయకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సినీనటి త్రిష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్టేడియం నలుదిక్కులా అభిమానులకు చేయి ఊపుతూ అభివాదం చేశారు. పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో స్టేడియం వద్ద కోలాహలం నెలకొన్నది. కాగా, నాలుగు రోజుల ఉత్కంఠ తర్వాత టీవీకేకు మద్దతు ప్రకటిస్తూ గవర్నర్‌కు వీసీకే లేఖ అందించింది. కాసేపటికే ఐఎంయూఎల్? కూడా విజయ్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐఎంయూఎల్? మద్దతుతో టీవీకే బలం 120కి చేరింది. శనివారం సాయంత్రం గవర్నర్‌ను కలిసిన విజయ్ మద్దతు లేఖలు సమర్పించారు.

➢ మిగతా 2వ పేజిలో..


# బంగాళాఖాతంలో అల్పపీడనం



**విశాఖపట్నం జనసంఘర్షణ**
బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, ఈ మేరకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. మన్నార్ గల్ఫ్‌తో పాటు దాని సమీపంలోని శ్రీలంక ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడనం ఏర్పడనుందని పేర్కొంది. ప్రస్తుతం ఈ ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి సుమారు 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి స్థిరంగా కొనసాగుతోందని, ఇది మరింత బలపడితే అల్పపీడనంగా మారే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. సముద్ర మట్టానికి సుమారు 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ ద్రోణి ఈశాన్య బీహార్ నుంచి జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కోస్తాంధ్ర మధ్య ప్రాంతాల వరకు విస్తరించి ఉన్నట్లు వాతావరశాఖ అధికారులు వివరించారు. ఇదిలా ఉండగా.. రాగల రెండురోజుల్లో తెలంగాణలోని పలుచోట్ల తేలికపాటి

➢ మిగతా 2వ పేజిలో..

# పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. పర్షియన్ గల్ఫ్ సముద్రంలో ప్రయాణిస్తున్న ఓ భారీ కార్గో నౌకపై జరిగిన భీకర దాడి అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా సుమారు 43 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని డ్రోన్ లేదా క్షిపణి బలంగా ఢీకొనడంతో నౌకలో ఒక్కసారిగా భారీ మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని బ్రిటిష్ మిలిటరీకి చెందిన యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ అధికారికంగా వెల్లడించింది.దాడి జరిగిన వెంటనే నౌకలోని సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ఈ దాడి వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటివరకు ఏ దేశం లేదా ఉగ్రసంస్థ బాధ్యత స్వీకరించలేదు. ఈ ఘటనపై ఖతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. వాణిజ్య, పౌర నౌకలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన అని పేర్కొంది. అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతం తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లో ఉన్న సమయంలో ఈ దాడి జరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

➢ మిగతా 2వ పేజిలో..

# కాజీపేట- విజయవాడకు మూడోలైన్



**విజయవవాడ జనసంఘర్షణ**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించే అత్యంత కీలకమైన విజయవాడ-కాజీపేట రైల్వే మార్గంలో మూడో లైను ప్రాజెక్టు తుది దశకు చేరుకుంది. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణ సమయం తగ్గడంతో పాటు సరకు రవాణాలో కొత్త మైలురాయిని చేరుకోనుంది.

➢ మిగతా 2వ పేజిలో..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
11 సోమవారం, మే 2026

# వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

**మొదటిపేజీ తరువాయి..** ప్రజలు విశ్వాస పాలనను కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ కుటుంబ పాలన పట్ల ప్రజలు విసిగిపోయి ఓడించారన్నారు. ఈ సారి తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు కూడా కుటుంబ పార్టీలేనన్నారు.

దేశాభివృద్ధిలో తెలంగాణది కీలక భూమిక

పదేళ్ల కిందట బెంగాల్‌లో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని, ప్రస్తుతం బెంగాల్‌లో 200 మందికిపైగా సభ్యులతో ప్రభుత్వం ఏర్పాటు చేశామన్నారు. బీజేపీ జెండా ఎత్తేందుకు అవకాశం లేనిచోట కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బీజేపీ ఏర్పాటైన తొలినాళ్లలో రెండు ఎంపీ సీట్లు మాత్రమే గెలిచిందని, ఇందులో ఒకటి తెలంగాణలో విజయం సాధించిందన్నారు. బీజేపీకి అవసరమున్న ప్రతిసారి తెలంగాణ అండగా నిలిచిందని, వచ్చే ఎన్నికల్లో అఖండ మెజారిటీతో బీజేపీకి అధికారంలోకి వస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు, కార్యకర్తలు చూస్తే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామనే భరోసా కలిగిందన్న ఆయన.. అబ్ కీ బార్ తెలంగాణ అంటూ కార్యకర్తలతో నినాదాలు చేయించారు. దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక భూమిక పోషిస్తోందని, రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం వికసిస్తోందన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

తెలంగాణ అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు చేశామని, దేశం మొత్తానికి ఏడు పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కులు ఇస్తే.. ఇందులో ఒకటి తెలంగాణకు ఇచ్చామని తెలిపారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌తో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. బీజేపీ దృష్టి ఎప్పుడూ అభివృద్ధి, ఉపాధి మీద మాత్రమే ఉంటుందన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్నాటక ప్రజలు బాధపడుతున్నారని, తెలంగాణలోనూ కాంగ్రెస్‌ను గెలిపించినందుకు ప్రజలు బాధపడుతున్నారన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో.. తర్వాత మర్చిపోవడమేనన్నారు. కాంగ్రెస్ మూడురాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉందని, ఆ పార్టీ ఎక్కడ అధికారంలో ఉన్నా అబద్ధాలతోనే పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. హామీలతో ఆకాశానికి ఎత్తి తర్వాత మోసం చేస్తారన్నారు. కాంగ్రెస్ మావోయిస్ట్ పార్టీగా మారిందని, ముస్లింలీగ్ మావోయిస్ట్ పార్టీగా కాంగ్రెస్ మారిందదన్నారు. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడు అభివృద్ధి నిరోధకులతోనే ఉంటాయని ఆరోపించారు. దేశమంతా మావోయిస్టులు రహితంగా మారిందని, తెలంగాణ సైతం మారుతోందన్నారు.

# చంద్రబాబు నివాసానికి మోడీ

**మొదటిపేజీ తరువాయి..** ప్రధాని చూపిన ఆత్మీయత, ఆప్యాయత ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి ఇంటికి వచ్చినందుకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రధాని అందిస్తున్న నిరంతర మద్దతుకు ధన్యవాదాలు తెలిపారు. కుటుంబ సభ్యులతో భేటీ అనంతరం, ప్రధాని మోదీ మరియు చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు మరియు రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన సహకారంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**మొదటిపేజీ తరువాయి..** నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ శాఖ వివరించింది. రాబోయే రెండురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలో పెద్దగా మార్పులుండవని తెలిపింది. ఆ తర్వాత రాగల రోజులు క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# ఆగస్ట్ కోటా తిరుమల సేవా టిక్కెట్లు

**18న విడుదల చేయనున్న టిటిడి**

**తిరుమల, మే9** : తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆగస్టు నెల కోటాను తితిదే ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లాటరీలో ఎంపికైన భక్తులు ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నంలోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి. 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా మధ్యాహ్నం 3 గంటలకు విడుదలవుతుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం కోటా, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన కోటా అందుబాటులో ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన కోటా విడుదలవుతుంది. 25న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు అ÷-దదె గదుల బుకింగ్ కోటా విడుదల చేస్తారు. భక్తులు వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

# తమిళ రాజకీయాల్లో సంచలనం.. ప్రజల సీఎంగా విజయ్ కొత్త ప్రయాణం




**మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా మే 10**

తమిళ సినీ ప్రపంచంలో స్టార్ హీరోగా కోట్లాది అభిమానులను సంపాదించిన జోసెఫ్ విజయ్ ఇప్పుడు రాజకీయాల్లోనూ తన ముద్ర వేస్తూ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని అధికారంలోకి రావడం ద్వారా విజయ్ తమిళ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు.

సినీ నటుడి నుంచి ప్రజా నాయకుడిగా

ఏళ్ల తరబడి సినిమాల ద్వారా సామాజిక సందేశాలను అందించిన విజయ్, ప్రజల సమస్యలపై స్పందిస్తూ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. యువత, మహిళలు, మధ్యతరగతి ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. సంప్రదాయ రాజకీయ పార్టీలకు భిన్నంగా ప్రజల మధ్యకే వెళ్లి ప్రచారం నిర్వహించడం ఆయనకు భారీ విజయాన్ని తీసుకొచ్చింది.

తొలి సంతకాలతోనే స్పష్టమైన సంకేతాలు

ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళల రక్షణ కోసం ప్రత్యేక దళం ఏర్పాటు, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకునే ఫైళ్లపై తొలి సంతకాలు చేయడం ప్రజల్లో ఆశలు పెంచింది. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది.

యువతలో కొత్త ఉత్సాహం

విజయ్ విజయం యువతలో కొత్త రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయాల్లో డబ్బు, వంశపారంపర్య ప్రభావం కాకుండా ప్రజల నమ్మకం ముఖ్యమని ఈ ఫలితం చూపించిందని అభిమానులు చెబుతున్నారు. సోషల్ మీడియా వేదికగా కూడా విజయ్‌కు భారీ మద్దతు లభించింది.

అలియాబాద్‌లో అభిమానుల సంబరాలు

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా లో విజయ్ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. పటాకులు కాల్చి మిఠాయిలు పంచుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. “ప్రజల కోసం పనిచేసే నాయకుడిగా విజయ్ అన్న నిలవాలి. యువతకు ఆయన ఆదర్శంగా మారాలి” అని అభిమానులు పేర్కొన్నారు.

ప్రజల అంచనాలు భారీగా

సినీ రంగంలో విజయాన్ని సాధించిన విజయ్ ఇప్పుడు రాజకీయాల్లో కూడా ప్రజల అంచనాలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యతను తీసుకున్నారు. సంక్షేమం, అభివృద్ధి, యువత ఉపాధి, మహిళల భద్రత వంటి అంశాల్లో ఆయన ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో అన్నదానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

తమిళనాడులో ప్రారంభమైన ఈ కొత్త రాజకీయ ప్రయాణం భవిష్యత్తు రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# మోడీ సభలో పారిశుద్ధ కార్మికులకు నిరాశ

**టిఫిన్ బాక్స్ తీసుకెళ్లనివ్వలేదని కార్మికుల ఆవేదన,**

**సభ స్థలి వద్ద పోలీసుల ఓవరాక్షన్**

మే 10, 2026, సికింద్రాబాద్, తెలంగాణ




సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని నరేంద్ర మోడీ సభ ముగిసిన అనంతరం విధులు నిర్వహించిన పారిశుద్ధ కార్మికులు నిరాశతో వెనుదిరిగిన ఘటన చోటుచేసుకుంది. సభ ప్రాంగణంలో శుభ్రత పనులు పూర్తి చేసిన కార్మికులు తమతో తీసుకువచ్చిన టిఫిన్ బాక్స్‌లను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడి విధులు నిర్వహించిన తమను కనీసం గౌరవంతో చూడలేదని కార్మికులు వాపోయారు. పని చేయించుకొని చివరికి మా టిఫిన్ బాక్స్ కూడా తీసుకెళ్లనివ్వలేదు అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో కొంతసేపు అక్కడే చర్చలు జరిగాయి. అనంతరం నిరాశతో కార్మికులు వెనుదిరిగారు. ఈ ఘటన అక్కడున్న వారిలో చర్చనీయాంశంగా మారింది. ప్రజా కార్యక్రమాల్లో సేవలందిస్తున్న పారిశుద్ధ కార్మికుల పట్ల మరింత మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం

దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన గవర్నర్, తమిళనాడు సీఎంగా విజయ్‌ను నియమిస్తూ లేఖ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో 69 ఏండ్ల తర్వాత డీఎంకే, అన్నాడీఎంకే ఏతర ప్రభుత్వం కొలువుదీరింది.

9 మంది మంత్రులు వీరే..

ఇక విజయ్‌తో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో ఏడుగురు టీవీకే, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ జాబితాలో ఒక మహిళ కూడా ఉన్నారు.

ఎన్. ఆనంద్, ఆదవ అర్జున, కేఏ. సెంగోటియన్, ఎస్. కీర్తన, కేజీ. అరుణ్ రాజ్, పీ. వెంకటరమణన్, సీఆర్. నిర్మల్ కుమార్, రాజ్‌మోహన్, టీకే. ప్రభు మంత్రులుగా ప్రమాణం చేశారు. దీంతో మంత్రివర్గంలో అతిపిన్న వయస్కురాలిగా కీర్తన రికార్డుల్లో నిలిచారు.

# కాజీపేట- విజయవాడకు మూడోలైన్

**మొదటిపేజీ తరువాయి..** దాదాపు 219 కిలోమీటర్ల పొడవున్న ఈ మూడో లైను మరియు విద్యుదీకరణ పనులను రైల్వే శాఖ యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తోంది. పనుల పురోగతి: మొత్తం 219 కి.మీ.లలో ఇప్పటికే 194 కిలోమీటర్ల మేర పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. చివరి దశ: ప్రస్తుతం డోర్నకల్ మహబూబాబాద్ మధ్య మిగిలి ఉన్న చివరి 25 కిలోమీటర్ల పనులను రాబోయే రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధాని అంకితం: ఈ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే సిద్ధమైన 118 కిలోమీటర్ల ట్రాక్‌ను ప్రధాని నరేంద్ర మోదీ నేడు జాతికి అంకితం చేయనున్నారు. ఈ అదనపు లైన్ అందుబాటులోకి రావడం వల్ల బహుముఖ ప్రయోజనాలు చేకూరనున్నాయి:
రద్దీ నివారణ: గ్రాండ్ ట్రంక్ రూట్‌లో భాగమైన ఈ మార్గంలో ఉత్తర భారతం నుంచి వచ్చే రైళ్ల ఒత్తిడి తగ్గుతుంది. రైళ్ల రాకపోకల్లో జాప్యం లేకుండా

# 11 వ తేదీ నుండి విద్యా వారోత్సవాలు

**జిల్లా కాలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్**

**హైదరాబాద్, మే9** : 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుండి నిర్వహించేంచే విద్యాశాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో సి ఎస్ మాట్లాడుతూ ఈ నెల 11 న ఎల్ బి స్టేడియం లో నిర్వహించనున్న విద్యావారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు బారి సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు చొరవతీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వారోత్సవాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను , రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్లకు విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కి సంబంధించిన పురోగతి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, జనాభా స్వీయ గణన కు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సి ఎస్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియొ కాన్ఫరెన్స్ లో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా , కళాశాల విద్యా శాఖ కమీషనర్ దేవసేన, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ , పౌర సరఫరాల శాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఐపిఎస్ భార్య కేసులు దర్యాప్తు ముమ్మరం


**తనూజ భౌతిక కాయానికి డిజిపి ఆనంద్ నివాళి**

**హైదరాబాద్, మే9** : విశ్రాంత ఐపీఎస్ వినయ్ రంజన్ రే భార్య తనూజ హత్య కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. శుక్రవారం తెల్లవారుజామున నేపాలీ గ్యాంగ్ ఆమెను హత్య చేసి బంగారం, నగదుతో ఉడాయించింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు విచారణను

# అమ్మ చెమట చుక్క.. కలెక్టర్ పీఠంపై విజయపు సంతకం

కొత్తగూడెం మే 10 (జన సంఘర్షణ)

మాతృత్వానికి భాష లేదు, కానీ ఆ మాతృమూర్తి పడే కష్టానికి విజయం అనే ఒక గొప్ప భాష ఉంటుందని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ జీవితం నిరూపిస్తోంది. అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా ఆయన పంచుకున్న జ్ఞాపకాలు కేవలం ఒక వ్యక్తిగత ప్రయాణం మాత్రమే కాదు, ఆశయాల కోసం పోరాడే ప్రతి సామాన్యుడికి ఒక పాఠం. ఒక సాధారణ బిస్కెట్ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తూ, ఆకలిని దిగమింగుకుని అక్షరాలను సాకిన ఆ తల్లి త్యాగం, నేడు సమాజానికి ఒక ఉన్నత అధికారిని కానుకగా ఇచ్చింది. నిరుపేద కుటుంబం, ఐదుగురు సంతానం, తండ్రి అరకొర సంపాదన.. ఇవన్నీ ఏ వ్యక్తినైనా కుంగదీసే సవాళ్లు. కానీ, వేణుగోపాల్ తల్లి మాత్రం తన పేదరికాన్ని పిల్లల భవిష్యత్తుకు అడ్డుగోడగా మారనివ్వలేదు. బిస్కెట్ ఫ్యాక్టరీలో గంటల తరబడి శ్రమిస్తూ, ఆ కష్టం నుంచి వచ్చిన ప్రతి పైసాను పిల్లల చదువుల కోసం వెచ్చించిన ఆ తల్లి సంకల్పం ముందు కొండల వంటి కష్టాలైనా తలవంచాల్సిందే. అమ్మ పడే శ్రమను కళ్లారా చూసిన ఏ బిడ్డకైనా, జీవితంలో ఏదో ఒకటి సాధించాలనే బలమైన ఆకాంక్ష కలగడం సహజం, అదే ఆయనను అదనపు కలెక్టర్ పీఠం వరకు నడిపించింది. నిజానికి, అమ్మ అంటే కేవలం జన్మనిచ్చిన వ్యక్తి మాత్రమే కాదు, ఒక బిడ్డలో అణిగిమణిగి ఉన్న ఆత్మవిశ్వాసాన్ని తట్టి లేపే అద్భుత శక్తి. రైల్వేలో తాత్కాలిక ఉద్యోగిగా తండ్రి పడే తపన ఒకెత్తయితే, ఆ పరిమిత వనరులతోనే సంసారాన్ని ఈదుతూ పిల్లలను ప్రయోజకులను చేయాలన్న తల్లి పట్టుదల మరొకెత్తు. ఆనాడు ఆ తల్లి పడిన ప్రతి చెమట చుక్క, ఈనాడు ఒక జిల్లా పాలనలో కీలక నిర్ణయాలు తీసుకునే స్థాయికి తన కుమారుడిని చేర్చిందంటే, అది మాతృశక్తి విజయం కాక మరేమిటి? సమాజంలో నేడు ఎంతోమంది యువత చిన్న చిన్న కష్టాలకే కుంగిపోతుంటారు. కానీ, వేణుగోపాల్ విజయ ప్రస్థానం మనకు నేర్పే పాఠం ఒక్కటే–మనం ఎక్కడ పుట్టాం అన్నది ముఖ్యం కాదు, మన వెనుక నిలబడిన తల్లి దీవెన, ఆమె పడిన కష్టం మనల్ని ఎక్కడికి తీసుకెళ్తుంది అన్నదే ముఖ్యం. బిస్కెట్ల తయారీలో అరిగిన ఆ తల్లి చేతులు, తన కొమ్మకు వికసించిన కలెక్టర్ అనే పుష్పాన్ని చూసి నేడు పొందే తృప్తి




వెలకట్టలేనిది. అమ్మ కష్టాన్ని విజయ తీరానికి చేర్చడమే ఒక బిడ్డ ఇచ్చే నిజమైన మాతృ దినోత్సవ కానుక. విజయానికి వారసత్వాలు అక్కర్లేదు, అమ్మ త్యాగాన్ని గుర్తించే హృదయం, ఆ కష్టాన్ని తీర్చాలనే కసి ఉంటే చాలు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ విజయం కేవలం ఆయన ఒక్కరిదే కాదు, ఓటమిని అంగీకరించని ప్రతి తల్లి సంకల్పానికి ఇది నిలువెత్తు సాక్ష్యం. అమ్మ ప్రేమలోని స్వచ్ఛత, ఆ కష్టంలోని పవిత్రత ఎప్పుడూ వృథా పోవని చెప్పడానికి ఇంతకంటే గొప్ప ఉదాహరణ మరొకటి ఉండదు.

# ఇసుక 'నిల్వ'.. సామాన్యుడి 'కళ్లల్లో ఇసుక'

పాల్వంచ మే 10 (జన సంఘర్షణ)

పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం ఇసుక కుప్పలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పట్టుబడిన ఇసుక అక్కడ గుట్టలుగా పేరుకుపోతుంటే, మరోపక్క ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే నిరుపేదలు ఒక్క ఇసుక రేణువు కోసం అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజా సమస్యలపై గొంతెత్తిన బుడగం నాగేశ్వరరావు**



ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ భద్రాద్రి జిల్లా కన్వీనర్, ప్రముఖ ఉద్యమనేత బుడగం నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఇసుక ర్యాంపులను ప్రారంభించడంలో ప్రభుత్వం చూపిస్తున్న జాప్యం వెనుక మర్మమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు కీలక నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్నా, సామాన్యుడి కష్టాలు తీరకపోవడం శోచనీయమని ఆయన విమర్శించారు.

**అధికారుల నిర్లక్ష్యం - లబ్ధిదారుల అరిగోస**



తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్న ఇసుకను వెంటనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇసుక దొరక్క భవన నిర్మాణాలు ఆగిపోయి, పేదలు ఆర్థికంగా చితికిపోతున్నా అధికారులు చోద్యం చూడటం వెనుక అంతర్యమేమిటని ఆయన నిలదీశారు. ర్యాంపులు మూసి ఉంచి బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహిస్తున్నారా అనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

**జిల్లా కలెక్టర్ స్పందించాలి**



భద్రాద్రి జిల్లా కలెక్టర్ వెంటనే రంగంలోకి దిగి ఇసుక ర్యాంపుల ప్రారంభంపై స్పష్టత ఇవ్వాలని బుడగం నాగేశ్వరరావు కోరారు. జిల్లా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ నిబంధనల సాకుతో కాలయాపన చేయకుండా త్వరితగతిన ఇసుక లభ్యతను పెంచాలని ఆయన హెచ్చరించారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల ముందే ఇసుక కుప్పలు కనిపిస్తున్నా, అది సామాన్యుడి ఇంటి నిర్మాణానికి పనికిరాకపోవడం వ్యవస్థలోని లోపానికి నిదర్శనం. రాజకీయ నేతల 'మొనగాడు' తనం మాటలకే పరిమితం కాకుండా, పేదవాడి ఇంటి కల నెరవే ర్చడంలో కనిపి ంచాలి. బుడగం నాగేశ్వరరావు లేవనెత్తిన ఈ ప్రశ్నలు ఇప్పుడు జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆత్మరక్షణలో పడేశాయి.

# ఆధ్యాత్మిక వారధి: కొండగట్టు అంజన్నకు భద్రాద్రి రామయ్య పట్టు వస్త్రాలు

భద్రాచలం మే 10 (జన సంఘర్షణ)

భద్రాద్రి పుణ్యక్షేత్రం, కొండగట్టు క్షేత్రాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధం మరోసారి ఆవిష్కృతమైంది. కొండగట్టులో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి వారికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం తరపున ఈవో కే. దామోదర్ రావు, స్థానాచార్యులు కే.ఈ. స్థలశాయి అత్యంత భక్తిశ్రద్ధలతో పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉభయ క్షేత్రాల ఆచార వ్యవహారాల కలయికగా సాగిన ఈ వేడుకను చూసి భక్తులు పులకించిపోయారు.

**వేద మంత్రాల సాక్షిగా పట్టు వస్త్రాల సమర్పణ**

ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న చెంత ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. భద్రాద్రి రామయ్య పంపిన పట్టు వస్త్రాలను దేవస్థానం ఈవో దామోదర్ రావు తన శిరస్సున మోసి ఆలయానికి తీసుకురాగా, స్థానాచార్యులు స్థలశాయి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రాముడి బంటుగా కొలువైన హనుమంతుడికి, సాక్షాత్తు ఆ రామయ్య క్షేత్రం నుంచే వస్త్రాలు రావడం ఒక అపురూప ఘట్టంగా నిలిచింది.

**సాంప్రదాయానికి సజీవ సాక్ష్యం**

తెలంగాణలోని అతిపెద్ద ఆధ్యాత్మిక కేంద్రాల మధ్య ఈ విధమైన 'వస్త్ర సమర్పణ' సంప్రదాయం కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, ఇది రెండు గొప్ప క్షేత్రాల మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీక. భద్రాద్రి దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడం, ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలకడం ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పింది.

**అధికారుల సమన్వయం - భక్తుల హర్షం**

దేవస్థానాల మధ్య ఇటువంటి సమన్వయం ఆధ్యాత్మిక పర్యాటకాన్ని, భక్తుల విశ్వాసాన్ని మరింత బలపరుస్తుంది. ఈవో దామోదర్ రావు మాట్లాడుతూ.. రామయ్య సేవలో తరించే హనుమంతుడికి ఈ వస్త్రాలు సమర్పించడం తమ పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులతో కొండగట్టు క్షేత్రం జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో మారుమోగింది.





**ఆధ్యాత్మిక పరిమళం.. అంజన్న ఆశీస్సులు**

కొండగట్టు అంజన్నను దర్శించుకునే భక్తులకు భద్రాద్రి రామయ్య ప్రసాదించిన పట్టు వస్త్రాల అలంకరణలో స్వామివారిని చూడటం ఒక ప్రత్యేక అనుభూతిని ఇచ్చింది. శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న ఇటువంటి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని, ఇది కేవలం మతపరమైన ప్రక్రియే కాదు, మన సంస్కృతికి వెన్నెముక అని వేద పండితులు అభిప్రాయపడ్డారు.

# భద్రాద్రి రామయ్యకు 'సువర్ణ తులసి' నీరాజనం!



భద్రాచలం మే 10 (జన సంఘర్షణ)

భద్రాచల పుణ్యక్షేత్రంలో ఆ సీతారామచంద్రుడి కైంకర్యాలు నిత్య నూతనంగా, భక్తి ప్రపత్తులతో విరాజిల్లుతున్నాయి. తాజాగా హైదరాబాద్‌కు చెందిన కండ్లకుంట శ్రీకాంత్, నీలిమ దంపతులు తమ భక్తిని చాటుకుంటూ సుమారు రూ. 3 లక్షల విలువైన, రాగిపై బంగారు పూత పూసిన 108 తులసి దళాలను స్వామివారికి సమర్పించారు. భౌతికమైన సంపద కంటే, ఆ దైవ చింతనలో పొందే ఆత్మీయ తృప్తి మిన్న అని చాటుతూ, ఈ విశిష్ట కానుకను ఆలయ అధికారులకు అందజేశారు. అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య తీర్థప్రసాదాలు అందుకున్న ఆ దంపతులు, రామయ్య సేవలో భాగస్వాములు కావడం తమ పూర్వజన్మ సుకృతమని భావోద్వేగానికి లోనయ్యారు. కోట్లాది రూపాయల ఆస్తులు ఉన్నా దక్కని ప్రశాంతత, కేవలం ఒక తులసి దళాన్ని ఆ స్వామి పాదాల చెంత చేర్చడం ద్వారా లభిస్తుందని ఈ ఘటన నిరూపిస్తోంది. లోక కల్యాణం కోసం నాడు రాముడు అడవుల పాలైతే, నేడు భక్తులు ఆ రాముడి నీడలో తరిస్తూ తమ వంతుగా సమర్పించుకుంటున్న ఈ 'సువర్ణ తులసి' అర్పణ, సమాజంలో భక్తి కలిగించే ఒక గొప్ప పరివర్తనకు నిదర్శనం.

# నిఘా నీడలో 'బస'.. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు!




కొత్తగూడెం మే 10 (జన సంఘర్షణ)

జిల్లాలో ఉన్న లాడ్జిలు కేవలం వ్యాపార కేంద్రాలుగా మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతకు ప్రతిబింబాలుగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్పష్టం చేశారు. శనివారం కొత్తగూడెం ఐఎంఏ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. లాడ్జిల యాజమాన్యాలు లాభార్జనే ధ్యేయంగా కాకుండా, నేరాల నియంత్రణలో పోలీసు వ్యవస్థకు మూడవ కన్నులా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అసాంఘిక శక్తులు ఆశ్రయం పొందే అడ్డాగా లాడ్జిలు మారకూడదని, ప్రతి అతిథి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే గదులు కేటాయించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను జోడించి నిఘా కెమెరాల నిర్వహణలో రాజీ పడకూడదని హెచ్చరిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో యజమానుల అప్రమత్తతే సమాజానికి రక్షణ కవచమని ఆయన ఉద్ఘాటించారు.

# పెద్దమ్మతల్లి చెంత రావిచెట్టు కూలడంతో భక్తుల ఆవేదన

**❑ ప్రకృతి ప్రకోపానికి 'నమ్మకం' నేలకొరిగింది**

పాల్వంచ మే 10 (జన సంఘర్షణ)

పాల్వంచ మండలం కేపీ జగన్నాథపురంలోని ప్రసిద్ధ పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో విషాదం నెలకొంది. దశాబ్దాల కాలంగా భక్తులకు నీడను, నిశ్చలమైన నమ్మకాన్ని ఇస్తూ వస్తున్న పురాతన రావిచెట్టు శనివారం రాత్రి వీచిన గాలివాన బీభత్సానికి నేలకూలింది. తమ మొక్కులు తీరుతాయని ఎంతో భక్తితో భక్తులు ఊయలలు కట్టి పూజించే ఈ వృక్షం అకస్మాత్తుగా కూలిపోవడంతో, స్థానికులు భక్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇది కేవలం ఒక చెట్టు కూలిపోవడం కాదు, వేలాది మంది భక్తుల సెంటిమెంట్ దెబ్బతినడమేనని అక్కడి దృశ్యాలు సాక్ష్యం చెబుతున్నాయి.





**వందేళ్ల చరిత్ర.. నిమిషాల్లో ముగిసింది**

కేపీ జగన్నాథపురం పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లే భక్తులకు ఆ రావిచెట్టు ఒక చిరునామా. దశాబ్దాల చరిత్ర ఉన్న ఆ చెట్టు ఎంతోమంది పూర్వీకుల నుంచి నేటి తరం వరకు సాక్షిగా నిలిచింది. శనివారం రాత్రి ప్రకృతి ప్రకోపానికి ఆ మహా వృక్షం తలవంచక తప్పలేదు. పెనుగాలుల ధాటికి వేర్లతో సహా చెట్టు నేలకొరగడంతో ఆలయ ప్రాంగణం ఒక్కసారిగా కళావిహీనంగా మారింది.

**భక్తుల నమ్మకం - ఊయలల బంధం**

ఆ చెట్టుకు ఒక ప్రత్యేకత ఉంది. సంతానం కోసమో, కోరికలు తీరాలని కోరుకుంటూనో భక్తులు అక్కడ ఊయలలు కట్టడం ఆనవాయితీ. నేడు ఆ చెట్టుతో పాటు భక్తులు కట్టిన వందలాది ఊయలలు నేలపాలయ్యాయి. తమ మొక్కులు స్వామివారికి, అమ్మవారికి చేరవేసే మాధ్యమంగా భావించే ఆ వృక్షం ఇక లేదని తెలిసి భక్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆ చెట్టు కింద సేదతీరిన మధుర జ్ఞాపకాలను స్థానికులు నెమరువేసుకుంటున్నారు.

**అదృష్టవశాత్తూ తప్పిన ప్రాణనష్టం**

గాలివాన రాత్రి సమయంలో రావడం వల్ల ఆ ప్రాంతంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఒకవేళ సాధారణ పూజా సమయాల్లో ఈ ఘటన జరిగి ఉంటే ప్రాణనష్టం సంభవించేదని ప్రత్యక్ష సాక్షులు అభిప్రాయపడుతున్నారు. చెట్టు కూలిన ధాటికి ఆలయ ప్రాంగణంలోని కొన్ని నిర్మాణాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న అధికారులు, సిబ్బంది కూలిన చెట్టును తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

**పర్యావరణంపై ప్రకృతి హెచ్చరిక?**

ఇటీవలి కాలంలో అకాల వర్షాలు, పెనుగాలులు ఈ స్థాయిలో బీభత్సం సృష్టించడం పర్యావరణ మార్పులకు సంకేతంగా కనిపిస్తోంది. దశాబ్దాల పాటు గాలికి, ధూళికి తలవంచని మహా వృక్షాలు సైతం నేడు కుప్పకూలుతున్నాయి అంటే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటున్నదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భక్తుల నమ్మకానికి ప్రతీకగా ఉన్న ఈ చెట్టు స్థానంలో మళ్ళీ మొక్కలు నాటి పూర్వ వైభవం తీసుకురావాలని ఆలయ కమిటీ యోచిస్తోంది. మనం ఒక పురాతన వృక్షం కూలిపోతే దేవాలయ ప్రాంగణంలో ఉంది కాబట్టి, మన సెంటిమెంట్ ముడిపడి ఉంది కాబట్టి ఇంతలా ఆవేదన చెందుతున్నాం. కానీ, ఇదే ప్రకృతిలో ప్రతిరోజూ వేలాది చెట్లు నరికివేతకు గురవుతున్నా మనలో చలనం రావడం లేదు. పెద్దమ్మతల్లి సాక్షిగా పెరిగిన ఆ రావిచెట్టు మనకు నేర్పిన పాఠం ఒక్కటే–"నేను ఉన్నంత కాలం నీడను, ప్రాణవాయువును ఇచ్చాను." ఆ చెట్టు నేలకొరిగిన వేళ, మనం ప్రకృతిని ఎంతవరకు కాపాడుకుంటున్నామనే ప్రశ్నను ప్రతి భక్తుడు తన మనసులో వేసుకోవాల్సిన అవసరం ఉంది. సంప్రదాయాలను గౌరవించడంతో పాటు, ప్రకృతిని ప్రేమించడం కూడా దైవపూజతో సమానమని మనం గుర్తించాలి.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
సోమవారం
11 మే 2026

# భద్రాచలంలో ఇసుక దందాపై పోలీసుల 'పంజా'

భద్రాచలం మే 10 (జన సంఘర్షణ)
భద్రాచలం పట్టణంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణాకు పోలీసులు బ్రేక్ వేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టరును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమార్కుల ఆట కట్టించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.







**పోలీసుల నిఘా - పట్టుబడ్డ అక్రమ రవాణా**

భద్రాచలం పుణ్యక్షేత్రం పరిసరాల్లో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసే క్రమంలో పట్టణ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎటువంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టరును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు, లోతైన విచారణ ప్రారంభించారు.

**చాపకింద నీరులా ఇసుక దందా**

గోదావరి తీర ప్రాంతం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా చాపకింద నీరులా విస్తరిస్తోంది. రాత్రికి రాత్రే ఇసుకను తరలించి, అధిక ధరలకు విక్రయిస్తూ కొంతమంది దళారులు కోట్లు గడిస్తున్నారు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఎక్కడో ఒకచోట ఈ దందా సాగుతూనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. తాజా సంఘటనతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

**శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం**

పట్టణ సీఐ ఆధ్వర్యంలో పోలీసు బృందం ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేసింది. కేవలం వాహనాలను పట్టుకోవడమే కాకుండా, వీటి వెనుక ఉన్న సూత్రధారులను కూడా గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం చుట్టూ ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతరం గస్తీ నిర్వహిస్తామని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

**సామాన్యుడికి దక్కని ఇసుక.. అక్రమార్కులకు కాసులు**

ఒకపక్క ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ నిర్మాణాలకు ఇసుక కొరత వేధిస్తుంటే, మరోపక్క అక్రమ దందాతో ఇసుక తరలిపోవడం విడ్డూరం. సామాన్య ప్రజలు ఒక ట్రాక్టర్ ఇసుక కోసం వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. కానీ, నిబంధనలు తుంగలో తొక్కే వారికి మాత్రం ఇసుక యథేచ్ఛగా దొరుకుతుండటం వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది.

## రాజకీయ వ్యూహకర్త స్థాయి నుండి తమిళనాడు కేబినెట్‌లో కీలక మంత్రి వరకు మన కమ్మ కులస్తురాలు!!

తమిళనాడు/మే 10/(జన సంఘర్షణ)
ఇవాళ ముఖ్యమంత్రి విజయ్ మంత్రివర్గంలో 30 ఏళ్ల యువ ఎమ్మెల్యే ఎస్. కీర్తన మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు.


కేవలం 30 ఏళ్ల వయసులోనే ముఖ్యమంత్రి విజయ్ కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్న ఆమె, ఆధునిక రాజకీయాల్లో యువత పాత్రకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. చదువు పూర్తయ్యాక డేటా అనలిటిక్స్, స్టాటిస్టిక్స్‌పై ఉన్న పట్టుతో ఆమె 'షోటైమ్ కన్సల్టింగ్' సంస్థలో పొలిటికల్ కన్సల్టెంట్‌గా చేరారు. 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ విజయానికి అవసరమైన డిజిటల్ వ్యూహాలను రూపొందించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా 'సూపర్ సిక్స్' వంటి పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం, డేటా విశ్లేషణ ద్వారా నియోజకవర్గాల వారీగా ప్రచారాన్ని నడిపించడంలో ఆమె చాకచక్యం ప్రదర్శించారు. ఈ వృత్తిపరమైన అనుభవమే ఆమెను తమిళనాడు రాజకీయాల్లో విజయ్ స్థాపించిన 'తమిళ వెట్రి కళగం' (ంఎఖ) పార్టీకి దగ్గర చేసింది. పార్టీకి కేవలం సినీ గ్లామర్ మాత్రమే సరిపోదని, శాస్త్రీయమైన ఎన్నికల వ్యూహాలు అవసరమని గుర్తించిన విజయ్, కీర్తనలోని నైపుణ్యాన్ని గుర్తించి ఆమెకు శివకాశి నియోజకవర్గం నుండి పోటీ చేసే అవకాశం కల్పించారు. తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన కీర్తన, ఇప్పుడు మంత్రిగా సరికొత్త బాధ్యతను స్వీకరించబోతున్నారు. రాజకీయాలంటే కేవలం వారసత్వం లేదా సుదీర్ఘ అనుభవం మాత్రమే కాదు, పక్కా ప్రణాళిక మరియు ప్రజల నాడిని పట్టుకునే నైపుణ్యం ఉంటే యువత కూడా అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరని ఆమె నిరూపించారు. ఒక సాధారణ వ్యూహకర్తగా మొదలైన ఆమె ప్రస్థానం, నేడు తమిళనాడు ప్రభుత్వంలో కీలక నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరడం విశేషం. కంగ్రాట్స్ కీర్తన. తదితరులు పాల్గొన్నారు.



# తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం

- పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం
- రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ చేతుల మీదుగా ప్రమాణస్వీకారం
- ముఖ్యమంత్రి తో పటు, 9 మందికి చోటు

తమిళనాడు/మే 10:(జన సంఘర్షణ)
టీవీకే దళపతి విజయ్ ముఖ్యమంత్రి గా ఆదివారం జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో తమిళనాడు రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. విజయ్ తో పాటు తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ సినిమా ప్రముఖులు, రాజకీయ నాయకులు, విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.,




## శ్రీనగర్లో 9 వరస దొంగతనాలు

రుద్రూర్ వర్ని/మే10/(జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లావర్ని మండలంలోని శ్రీనగర్ గ్రామంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. గ్రామంలోని మొత్తం తొమ్మిది ఇళ్లలో చోరీ జరిగినట్లు సమాచారం. దొంగతనం ఘటనపై సమాచారం అందుకున్న సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ, ఇన్‌స్పెక్టర్ సురేష్, వర్ని ఎస్ఐ వంశీకృష్ణ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల ఇళ్లను పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ సిబ్బంది ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. దొంగలు ఎలాంటి వస్తువులు, నగదు అపహరించారనే విషయంపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.



## తల్లికి వందనం..

పొతంగల్/మే10/(జన సంఘర్షణ)
తల్లి నీకు వందనం.. ముక్కోటి దేవతలు ఉన్నప్పటికీ ముందుగా మనం కొలిచేది మనలను కన్న తల్లిని. జన్మనిచ్చే తల్లిగా, నవ మాసాలు మోసి, కొత్త లోకాన్ని, చిన్నారులకు పరిచయం చేసే ఆ తల్లులకు మాతృ దినోత్సవం సందర్భంగా జన సంఘర్షణ దినపత్రిక శుభాకాంక్షలు.



## మొక్కజొన్న, మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన బినోల సొసైటీ చైర్మన్

- బినోల సోసైటికి(పిఏసియస్) మొక్కజొన్న కోనుగోలు కేంద్రాన్ని మాంజూరు చేయించిన బోదన్ ఏమ్మేల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక దన్యావాదాలు తెలిపారు.

బోధన్ మే 10 జన సంఘర్షణ
నవీపేట్ మండలం బినోల సొసైటీ పరిధిలోని శాఖాపూర్ గ్రామంలో ఈరోజు మక్కల కొనుగోలు కేంద్రాన్ని బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు మాట్లాడుతూ రైతులు తాము పండించిన మక్కలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ద్వారా క్వింటాల్ కు 2400/ రూపాయలను, పొందగలరు. అలాగే రైతులు తమ మక్కల యొక్క తేమశాతం14% మించకూడదని అలాగే ఎకరాకు 26 కింటల్లా 50 కిలోలు మాత్రమే ప్రభుత్వం కోనుగోలు చేస్తుందన్నారు,రైతులు ఇది గమనించగలరని, అన్నారు బినోల సొసైటీ పరిధిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గారికి సొసైటీ తరపున మరియు రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో చైర్మన్ మగ్గరి హన్మండ్లు, లింగాపూర్ సర్పంచ్ దూడల శ్యామల బాల్ రాజ్ గౌడ్, మరియు లింగాపూర్ డైరెక్టర్ బాలుచందర్ గౌడ్, ఉప సర్పంచ్ ఒడ్డేన్న, మరియ సీఈఓ రమేష్, మేహన్, మోగులయ్య, పోతన్న, దేవన్న, రాజేశ్వర్, దర్మన్న, సాయిలు రైతులు పాల్గొన్నారు.



## రుద్రూర్‌లో రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ



- బోనం ఎత్తిన ఎస్సై సాయన్న

రుద్రూర్ ,/మే10/(జన సంఘర్షణ)
గీత కార్మికుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయన్న పాల్గొని బోనం ఎత్తుకొని మహిళలతో సమానంగా ఆయన రేణుక ఎల్లమ్మ ఆలయం వరకు చేరుకున్నారు. భాజా భజంత్రీల మధ్య ఊరేగింపుగా గాంధీచౌక్ నుంచి ప్రారంభమైన ఈ రేణుక ఎల్లమ్మ బోనాలు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. పెద్ద ఎత్తున మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయం వరకు చేరుకోగా మరి కొంత మంది మహిళలు మంగళ హారతులతో అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన ఓడి బియ్యం, గాజులు సమర్పించి బోనాలను సమర్పించారు. గ్రామాన్ని చల్లగా చూడు తల్లి అంటూ మహిళలు రేణుక ఎల్లమ్మను ప్రార్థించారు. గీత కార్మికులకు కుటుంబాలకు ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ బోనాల పండుగను ప్రతి ఏటా ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామంలో రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. చిన్న పెద్ద, మహిళలు అనే తేడా లేకుండా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## బీర్కూర్ సితలే రమేష్ వారి వాట్సాప్ స్టేటస్ ద్వారా గో సేవకులు,వారి స్నేహితుల ద్వారా నగదు 39000 ఆర్థిక సాయం



బీర్కూర్/మే 10/(జన సంఘర్షణ)
కొన్ని రోజుల క్రితం బోధన్ ఏకచక్రశ్వర గోశాల లో సుమారుగా 4 లక్షల విలువ చేసే గడ్డి కట్టలు (పశుగ్రాసం) కాలిపోయింది, ఈ విషయం తెలుసుకుని బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు, సామాజిక సేవకుడు, రక్తదాన ఫౌండర్, గోమాత సేవకుడు అయినటువంటి సితలే రమేష్ వారి వాట్సాప్ స్టేటస్ ద్వారా గో సేవకులు, వారి స్నేహితుల ద్వారా నగదు 39000 రూపాయలు బోధన్ గో శాల కమిటీకి ఇవ్వడం జరిగింది. అలాగే అదే విధంగా ఈ రోజు వరకు సుమారుగా 650 వరకు గడ్డి కట్టలను కూడా పంపడం జరిగింది. వీరికి వీరి బోధన్ ఏక చక్రేశ్వర గోశాల తరపున ధన్యవాదాలు తెలుపుతూ చిన్నపాటి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గో శాల అధ్యక్షులు నేపాల్ సింగ్ (జీవన్ ఎలాక్ట్రికల్స్), గో సేవకులు సురేష్ ఈనాని, శ్రీనివాస్, చరణ్, ఆయిల్ శివ,సోలపూర్ శివ,దత్తు పటేల్ ,ప్రవీణ్ గౌడ్,సంతోష్ పటేల్ లు పాల్గొన్నారు.

## జల్లపల్లి కొత్త అబాది గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడి ఆరిఫ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించగా ముఖ్య నాయకులు హకీమ్ సమావేశం

పొతంగల్ /జల్లపల్లి అబాది/మే 10/ జన సంఘర్షణ:



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని జల్లపల్లి కొత్త అబాది గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడి ఆరిఫ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించగా ముఖ్య నాయకులు హకీమ్ సమావేశంలో పాల్గొని కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని ఆరిఫ్ ని ఆశీర్వదించి విందు భోజనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జల్లపల్లి ఎక్స్ సర్పంచ్ షేరు, మజీద్ ప్రెసిడెంట్ యూసుఫ్, ఫీల్డ్ అసిస్టెంట్ దేవి సింగ్, గంధపు దత్తు, కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంతో ఎంపీ వేమిరెడ్డి దంపతుల భేటీ

నెల్లూరు జిల్లా-జన సంఘర్షణ:



నెల్లూరు సంతపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. జిల్లాలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు ఏర్పాట్లు, జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి ఆనంతో సుదీర్ఘంగా చర్చించిన ఎంపీ వేమిరెడ్డి దంపతులు. మంత్రి ఆనం తనయ ఆనం లీలా కైవల్య రెడ్డితో ఆప్యాయంగా ముచ్చటించిన ఎంపీ వేమిరెడ్డి దంపతులు.

## జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ సిద్ధిఖ్ మేనల్లుడు వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



నెల్లూరు జిల్లా-జన సంఘర్షణ:

నెల్లూరు కుద్దూస్ నగర్ ఏ బి సి ఫంక్షన్ హాల్లో వైసిపి జిల్లా ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షులు షేక్ సిద్ధిఖ్ మేనల్లుడు హర్షద్ వివాహ వేడుకకు వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన వధూవరులు కలకాలం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి వెంట ముస్లిం మైనారిటీ నేతలు అబ్దుల్ మస్తాన్, రఫీ, యస్ధాని పాల్గొన్నారు.

# జగనన్న పుణ్యాన పేదలకు ఇళ్ళు: కాకాణి గోవర్ధన్ రెడ్డి

నెల్లూరు జిల్లా- జన సంఘర్షణ:

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, ముత్తుకూరు మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మదేవం గ్రామంలో జగనన్న కాలనీని సందర్శించిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయూ డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి. బాణాసంచా పేల్చుతూ, మేళ తాళాలతో గజమాలల తో మాజీ మంత్రి కాకాణి కి ప్రతి గడపలో పూలు చల్లుతూ, ఆత్మీయ స్వాగతం పలికిన జగనన్న కాలనీ వాసులు.

జగనన్న కాలనీలో నిర్మించిన గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి. లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్ల వివరాలను అడిగి తెలుసుకుని, లబ్ధిదారులతో మమేకమై, కాలనీ నివాసితులతో ఆత్మీయంగా ముచ్చటించిన కాకాణి. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని, ఇళ్లల్లో కాపురాలు ఉంటున్న కుటుంబాలు, తమకు ప్లాట్లు కేటాయించి, ఇళ్ళు నిర్మించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వం తిరిగి వచ్చి ఉంటే తమకు రోడ్లు, సైడ్ కాలవలు లాంటి మౌలిక సదుపాయాలు కూడా పూర్తి చేసి ఉండే వారిని , కూటమి ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని కాలనీవాసులు పేర్కొన్నారు.

లక్షలాది రూపాయలు విలువైన ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్ళు నిర్మించి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మహిళలు.

తమకు సైడ్ డ్రైన్లు, సిమెంట్ రోడ్లు లేవని, వర్షం వస్తే ఇబ్బందులు పడుతున్నామని కాకాణి కి తెలిపిన జగనన్న కాలనీవాసులు. జగనన్న వచ్చి ఉంటే మౌలిక సదుపాయాలన్నీ పూర్తి అయ్యేవని, రాబోయే ఎన్నికల్లో గెలిచి జగనన్న ముఖ్యమంత్రి అయిన వెంటనే మౌలిక సదుపాయాలన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన కాకాణి. దశాబ్దాలుగా ఇంటి స్థలం లేక అనేక అగచాట్లు పడుతున్న తమకు, ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇళ్లు మంజూరు చేసి, ఇళ్ళు నిర్మించుకునే అవకాశం కల్పించడంతోపాటు , తన భార్య అనారోగ్యానికి గురై డయాలసిస్ చేయించుకునే పరిస్థితిలో తనకు పదివేల రూపాయల పెన్షన్ మంజూరు చేసి జగనన్న ఆదుకున్నాడని పేర్కొంటూ భావోద్వేగానికి గురైన మారు బోయిన సురేంద్ర దంపతులు. జగనన్న పుణ్యాన సొంత ఇళ్లు కట్టుకుని ,శ్రద్ధగా చదువుకుంటూ ,క్రీడలపై ఆసక్తి కనబరుస్తూ తాను ఎనిమిది ప్రపంచ రికార్డులు స్కేటింగ్ పోటీలలో నెలకొల్పానని , తాను ఎంతో ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లడానికి జగనన్నే కారణమంటూ కాకాణి కి తెలియజేసిన చిరంజీవి శ్రీజ. అనేక సంవత్సరాలుగా అద్దె ఇంట్లో కాపురం ఉంటూ అనేక అవస్థలు పడుతున్న తమకు ఇళ్ల ప్లాటు ఇవ్వడంతో పాటు ఇళ్లు మంజూరు చేయడంతో చక్కని ఇళ్లు కట్టుకుని ఇద్దరు పిల్లలతో సంతోషంగా ఉంటున్నామని, సంతోషాన్ని వ్యక్తం చేసిన టైల్స్ మేస్త్రి మస్తాన్ దంపతులు. బ్రహ్మదేవం సచివాలయం దగ్గర తమ గిరిజనులకు లేఅవుట్ వేసి, ప్లాట్లు పంపిణీ చేసిన స్థలాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగుదేశం పార్టీ నాయకులు లాగేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారని, తమ ప్లాట్లు తమకు ఇచ్చి, ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కాకాణికి వినతి పత్రం సమర్పించిన గిరిజనులు. గిరిజనుల ఇళ్లు అర్ధాంతరంగా ఆపివేశారని, స్థానిక నాయకుడు మస్తాన్ ఇళ్ళు కట్టడానికి వీలులేదని తెలుగుదేశం పార్టీ నాయకులు హుకుం జారీ చేయడంతో , తమ ఇళ్ళు అర్ధాంతరంగా ఆగిపోయి అనేక ఇబ్బందులు పడుతున్నామని , జగనన్న హయాంలో ప్లాట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుండా అడ్డుకుంటున్న తమకు న్యాయం చేయాలని కాకాణి కి గిరిజనుల వేడుకోలు. పర్యటన పొడవునా సామాన్య ప్రజలతో కలిసి నడుస్తూ, వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్న కాకాణి. లబ్ధిదారులు తమకు గూడు కల్పించినందుకు జగనన్నకు కాకాణి కి కృతజ్ఞతలు




తెలపగా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని హామీ ఇచ్చిన కాకాణి. పది తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో అత్యుత్తమ మార్కులు (587) సాధించిన బ్రహ్మదేవం గ్రామానికి చెందిన విద్యార్థిని కాళంగి లక్ష్మీ శ్రావ్యను, శాలువా కప్పి, మెమొంటో (జ్ఞాపిక) అందజేసి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించిన కాకాణి.

**కాకాణి స్ట్రోకింగ్ పాయింట్స్:**

పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పనిచేశారు. ఆంధ్ర రాష్ట్రంలో నిర్మించిన జగనన్న కాలనీలు రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనం. వైఎస్ జగన్మోహ రెడ్డి ప్రభుత్వంలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా, ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ళ నిర్మాణ కార్యక్రమాలు జరిగాయి. కూటమి పాలకుల నిర్లక్ష్యం కారణంగా జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణాలు ఆగిపోయాయి, మౌలిక వసతులు కుంటుపడ్డాయి. సోమిరెడ్డి ఆదేశాలతో సర్వేపల్లి నియోజకవర్గం లో జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు జరగకుండా ఆపివేశారు. జగన్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగింది. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్న చోట లేఅవుట్లు వేసి ఇచ్చాము , భూమి లేని చోట్ల కోట్లాది రూపాయల వెచ్చించి , ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూములను కొనుగోలు చేసి మరీ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాం. బ్రహ్మదేవం ప్రాంతంలో ఇళ్ల పట్టాల సమస్య సుమారు 24 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదు. 2002లో అప్పటి మండల పరిషత్ అధ్యక్షులు దివంగత మెట్టా చంద్రశేఖర్ రెడ్డి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రయత్నిస్తే, అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అడ్డుకున్నాడు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి సోమిరెడ్డి మంత్రిగా ఉన్నప్పటికీ, ఈ ప్రాంత పేదల ఇళ్ల పట్టాల గురించి పట్టించుకోలేదు. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరించి, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ళు నిర్మించి ఇచ్చాం. టిడిపి నాయకులు పేదల సొంతింటి కలను అడ్డంకులు సృష్టించి అపహాస్యం చేస్తున్నారు. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పేదలకు దక్కిన ఇళ్ల స్థలాల విషయంలో ప్రస్తుత పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయి. దాదాపు 4 ఎకరాల 57 సెంట్ల ప్రభుత్వ భూమిలో నుడా తరహాలో అధునాతనంగా 137 ప్లాట్లతో లేఅవుట్ వేసి పేదలకు పట్టాలు పంపిణీ చేయడం జరిగింది. జగనన్న కాలనీలో ఒక్కొక్కరికి 9 అంకణాల స్థలం కేటాయించగా, దాదాపు 74 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. ఇందులో 54 ఇళ్లలో ఇప్పటికే ప్రజలు నివసిస్తుండగా, మరో 20 ఇళ్లు పూర్తి కావాల్సి ఉంది. జగనన్న లేఅవుట్‌లో ఎస్టీలకు 36 ప్లాట్లు కేటాయించాము. చెట్ల కింద, కాలువ గట్లపై నివసించే వారి బతుకులు మారాలని ఈ నిర్ణయం తీసుకున్నాము. ప్రభుత్వం ఇచ్చే నిధులకు అదనంగా, సర్వేపల్లి నియోజకవర్గంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 15,000 చొప్పున అదనపు సాయం అందించి ,ఇళ్లు నిర్మించే బాధ్యతను స్థానిక నాయకుడు మస్తాన్ కు అప్పగించాం. టిడిపి నాయకుల నిర్లక్ష్యం వల్ల బేస్మెంట్ లెవెల్, స్లాబ్ లెవెల్ వరకు వచ్చిన , అనేక గిరిజనుల ఇళ్ల నిర్మాణం ప్రస్తుతం అర్ధాంతరంగా నిలిచిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలు, ముఖ్యంగా ఎస్టీ (గిరిజన) సామాజిక వర్గానికి చెందిన వారిపై కక్షసాధింపు చర్యలకు దిగుతోంది. బ్రహ్మ దేవం గ్రామంలో మరొక జగనన్న కాలనీలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను తెలుగుదేశం పార్టీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని, వ్యవసాయం చేస్తున్నారు. బ్రహ్మదేవంలో ప్రస్తుతం మనము ఉన్న జగనన్న కాలనీ కృష్ణపట్నం పోర్టు రహదారికి ఆనుకుని ఉన్న అత్యంత ఖరీదైన భూములలో పేదలకు లేఅవుట్ వేసి ప్లాట్లు ఇచ్చాం. ఒక్కో అంకణం రూ. 1.50 లక్షల పలుకుతున్న భూమిని,దాదాపు రూ. 13 నుండి 15 లక్షల విలువ చేసే ఆస్తిని పేదలకు ఉచితంగా పట్టాల రూపంలో అందించిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదే. జగనన్న కాలనీలో ఇళ్ళు పూర్తి చేయకుండా టిడిపి నాయకులు అడ్డుకొని, ఇబ్బందులు పెట్టడం అన్యాయం. పేదల ఆత్మగౌరవ ప్రతీకలైన ఈ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి, మిగిలిన లబ్ధిదారులకు అప్పగించాలని కూటమి నాయకులను డిమాండ్ చేస్తున్నా. సోమిరెడ్డి కేవలం మాటలతోనే తాను పేదల పక్షపాతినని చెప్పుకుంటాడు, కానీ ఆచరణలో వారికి ఇళ్లు కట్టించి ఇచ్చింది జగనన్న హయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల విషయంలో కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గాలి , లేనిపక్షంలో ప్రజల తరఫున పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం. అధికారం ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా పేదలకు అందుబాటులో ఉంటూ వారికి అన్ని విధాల అండగా నిలుస్తామని కాకాణి అన్నారు.

## కాకాణిని విమర్శించే అర్హత మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి లేదు: సమీర్ ఖాన్

నెల్లూరు జిల్లా-జన సంఘర్షణ:

మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని విమర్శించే అర్హత మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సమీర్ ఖాన్ విమర్శించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సమీర్ ఖా మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

సమీర్ ఖాన్ మాట్లాడుతూ.. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి రాజకీయంగా చనిపోయిన వ్యక్తి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని విమర్శించే అర్హత లేదు. జడ్పీటిసి, ఎంపీపీ, ఎంపీటీసీ, మార్కెట్ కమిటీ చైర్మన్ లాంటి పదవులతో పాటు పార్టీ పదవులను కూడా అమ్ముకున్న నీచ చరిత్ర మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిది. నీచమైన రాజకీయ చరిత్ర గల మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి కాకాణి ని విమర్శించడం సిగ్గుచేటు. కాకాణి గోవర్ధన్ రెడ్డిని విమర్శించే స్థాయి గాని, అర్హతగాని మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి లేదు. మేకపాటి రాజమోహన్ రెడ్డి కుటుంబం వల్లనే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి రాజకీయ భిక్ష లభించింది. మేకపాటి కుటుంబానికి జిల్లా రాజకీయాల్లో మంచి పేరు ఉంది. ఆ కుటుంబంలో చంద్రశేఖర్ రెడ్డి చెడగొట్టాడు. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి మేకపాటి కుటుంబానికి వెన్నుపోటు పొడిచారు. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యలు దిగజారుడుతనానికి పరాకాష్ట. ఉదయగిరి ఎమ్మెల్యే నిర్వహించే ఏ కార్యక్రమానికి మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని పిలవలేదంటేనే అతని స్థాయి ఏంటో తెలుస్తుంది. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వైఎస్ఆర్ కుటుంబం వల్లనే లబ్ధి పొంది తిరిగి ఆ కుటుంబాన్ని విమర్శించడం ఆయనకే చెల్లింది. నీ స్థాయికి దిగజారి మాట్లాడాలంటే మాకు సంస్కారం అడ్డు వస్తుంది. లేకుంటే నీ నీచ చరిత్ర మొత్తం బయటపెట్టే వాళ్ళం. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి బ్రహ్మానందానికి ఎక్కువ కళ్ళు చిదంబరానికి తక్కువ లాంటివాడు. గతంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో పదికి పది సీట్లు గెలిచాం మరల ఆయన సారథ్యంలోనే పదికి పది సీట్లు



గెలవబోతున్నాం. ఇప్పటికైనా మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది లేకుంటే ఆయనకు తనకు అర్థం అయ్యే భాషలోనే సమాధానం చెప్పవలసి ఉంటుంది.

# మాతృ మూర్తుల ఆశీర్వాదం తీసుకున్న గాలి బ్రదర్స్

**తొట్టంబేడు మే 10 జన సంఘర్షణ:**
మండలంలోని దిగువ కొడతనేరి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు మాతృ మూర్తుల ఆశీర్వాదం తీసున్నారు.ఈ సందర్భంగా గాలి బ్రదర్స్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో మారని అమ్మ ప్రేమ మనం ఎంత వేగంగా దూసుకుపోతున్నా,అమ్మ చూపే అనురాగం మాత్రం మారలేదు.ఒకప్పుడు ఉత్తరాల ద్వారా ప్రేమను పంచుకున్న తల్లులు,ఇప్పుడు వీడియో కాల్స్‌లో బిడ్డల ముఖం చూసి మురిసిపోతున్నారు.కానీ టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ మనం అమ్మకు ఇచ్చే 'సమయం' తగ్గిపోతోందా అనే ప్రశ్న ప్రతి ఒక్కరూ వేసుకోవాలి.అమ్మకు మనం ఇచ్చే అత్యంత ఖరీదైన బహుమతి మన సమయం, ప్రేమేనని అన్నారు. వృద్ధాప్యంలో తోడుగా ఉండాలన్న పిలుపు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ధోరణి పెరుగుతున్న నేటి సమాజంలో, అమ్మ విలువను గుర్తించడం అత్యంత అవసరం. మనల్ని నడక నేర్పిన చేతులకు, వృద్ధాప్యంలో ఆసరాగా నిలవడమే మనం చేసే అతిపెద్ద పూజ.ఈ మాతృ దినోత్సవం సందర్భంగా "మనల్ని పెంచి పెద్ద చేసిన మాతృమూర్తి కళ్ళలో కన్నీరు రాకుండా చూసుకుందాం" అని గాలి బ్రదర్స్ అన్నారు. సనాతన ధర్మంలో అమ్మ మహిమ భారతీయ సంస్కృతిలో తల్లి స్థానం దేవతలకన్నా గొప్పదని మాతృదేవో భవ అనే వాక్యం కేవలం ఉపదేశం కాదని అది సనాతన ధర్మపు జీవన సత్యం అని తెలిపారు. యశోదమ్మ ప్రేమ ముందు జగన్నాథుడైన శ్రీకృష్ణుడు కూడా చిన్న బాలుడిగా మారిపోయాడు. గణపతి దేవుడు తన తల్లిదండ్రులనే ప్రపంచంగా భావించి లోక విజేత అయ్యాడని తెలిపారు.ఈ మాతృ దినోత్సవం నాడు అమ్మకు ఖరీదైన బహుమతులు ఇవ్వడం కంటే,ఆమెతో కాసేపు మనసు విప్పి మాట్లాడటం,ఆమె కష్టాన్ని గుర్తించడం ముఖ్యం.అమ్మా, నువ్వు మాకు చాలా ముఖ్యం" అని చెప్పే చిన్న మాట ఆమెకు కొండంత బలాన్ని ఇస్తుంది. దైవం ప్రతిచోటా ఉండలేక అమ్మను సృష్టించాడు.అమ్మ లేని ఇల్లు దీపం లేని గది వంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ చౌదరి, తెలుగు యువత నాయకుడు నాని పాల్గొన్నారు.



# నాలుగు దశాబ్దాల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

- **ఉపాధ్యాయులు-సైనికులు దేశానికి పిల్లర్స్**
- **విశ్రాంతి హెచ్ఎం శారదమ్మ**

**పూతలపట్టు మే10జన సంఘర్షణ**
దేశానికి ఉపాధ్యాయులు. సైనికులు పిల్లర్స్ అని విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు శారదమ్మతెలిపారు. పూతలపట్టుఉన్నతపాఠశాలలో ఆదివారం జరిగిన నాలుగు దశాబ్దాల పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక నిర్వహించారు(1982-83). ఈసమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉపాధ్యాయులు విద్యను అందిస్తే.దేశ రక్షణలో సైనికులు దేశాన్ని ప్రజలను కాపాడుతున్నారని ఇలాంటి వారినిఎవ్వరుమరిచిపోకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులను సైనికులనుమరిచిపోకూడదన్నారుఉపాధ్యాయులను మరవకుండా పూర్వ విద్యార్థులు సన్మానించడం మనదేశంలోనే జరుగుతున్నదని ఇతర దేశాల్లో ఇలాంటి కార్యక్రమాలు జరగడం లేదన్నారు. దీనిద్వారా ప్రేమానురాగాలు పెరుగుతాయన్నారు. మాజీ హెచ్ఎం జయరామ నాయుడు మాట్లాడుతూ 43 సంవత్సరాల తర్వాత ఉపాధ్యాయులను మరవకుండా మాకు సన్మానం చేయడం పూర్వ జన్మ సుకృతం అని కొనియాడారు. విద్యార్థులందరూఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.దశాబ్దాల తర్వాత ఉన్నత పాఠశాలలో చదివిన వారందరూ ఒక్కసారిగా కలవడంతో వారి ఆనందం చెప్పలేని విధంగా ఉంది. ప్రతి ఒక్కరూ వాళ్ళు చదివిన క్లాస్ రూములు అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ గడిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పాఠశాలకు కంప్యూటర్ ని బహుకరించారు.వీరికి చదువులు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులైన జయరాం నాయుడు, శారదమ్మ, శాంతి కుమారి, సుబ్రమణ్యరెడ్డి, మునిరత్నం, రామలింగారెడ్డి, పాఠశాల హెచ్ఎం మధుసూదన్ రెడ్డిని ఎంఈఓ వాసు దేవన్న ఘనంగా సన్మానించి మెమొంటోళ్లు అందించారు. అప్పటి విద్యార్థి నేటిపాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించినందుకు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# తడ మండలం జాతీయ రహదారి పక్కన సత్యం జి బాలాజీ లేఅవుట్‌పై తీవ్ర ఆరోపణలు

- **మఠం భూములు, పంచాంగం సర్వే భూములు కలిపి లేఅవుట్ అభివృద్ధి చేస్తున్నారంటూ ఆరోపణలు**
- **అనుమతులు లేకుండానే భారీగా గ్రావెల్ అక్రమ తరలింపు..?**
- **350 ఎకరాల సాగుభూములకు నీరు అందించే పంటకాలువ పూడ్చివేతపై రైతుల ఆగ్రహం**
- **ఇంత జరుగుతున్నా పట్టించుకోని రెవెన్యూ సిబ్బందిపై గ్రామస్తుల విమర్శలు**

**తడ మే 10 ఆదివారం జన సంఘర్షణ**
తిరుపతి జిల్లా తడ మండలం గ్రద్దగుంట పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన నూతనంగా అభివృద్ధి చేస్తున్న 'సత్యం జి బాలాజీ హైవే లేఅవుట్' ప్రస్తుతం తీవ్ర వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఈ లేఅవుట్‌లో మఠం భూములు, పంచాంగం సర్వే భూములు కలిపి ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా లేఅవుట్ అభివృద్ధి పేరిట సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే భారీ స్థాయిలో గ్రావెల్ తరలింపు జరుగుతోందని, దిగువన ఉన్న వందల ఎకరాల సాగుభూములకు నీటిని అందించే పంటకాలువను పూడ్చివేసి దానిపై ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం, ఈ లేఅవుట్ పరిధిలోని సర్వే నెంబర్లు 111-6లో 1.02 సెంట్లు, 109-4లో 69 సెంట్లు, 109-5లో 21 సెంట్లు కలిపి మొత్తం 1.92 సెంట్ల భూమి పంచాంగం, మఠం భూములుగా పాత రికార్డుల్లో నమోదై ఉన్నట్లు చెబుతున్నారు. 1986, 1996 సంవత్సరాలకు సంబంధించిన పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయని, జీవో నెంబర్ 22-ఏ ప్రకారం ప్రస్తుత హక్కుదారులకు పట్టాలు మంజూరు చేయాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. అయితే ఈ భూములను కూడా లేఅవుట్‌లో కలిపి అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. "మఠానికి చెందిన భూమి గ్రామ ఆస్తి. దానిని కాపాడాల్సిన బాధ్యత అధికారులదే. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు" అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక లేఅవుట్ అభివృద్ధి పేరిట భారీ ఎత్తున గ్రావెల్ తరలింపు జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వేల టన్నుల గ్రావెల్‌ను తరలిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల నుంచి పూర్తి స్థాయి అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయంపై స్పష్టత లేదని చెబుతున్నారు. మైనింగ్ అనుమతులు ఉన్నాయని లేఅవుట్ యాజమాన్యం చెబుతున్నప్పటికీ, అక్రమంగా గ్రావెల్ తరలింపులు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా రెవెన్యూ, గనుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గ్రావెల్ తరలింపుల కారణంగా గ్రామ రహదారులు దెబ్బతింటున్నాయని, దుమ్ము కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. "పగలు, రాత్రి తేడా లేకుండా వాహనాలు తిరుగుతున్నాయి. పిల్లలు, వృద్ధులు బయటకు రావడానికే భయపడుతున్నారు" అంటూ గ్రామస్థులు తమ సమస్యలను వెల్లడిస్తున్నారు. ఈ లేఅవుట్‌కు సంబంధించిన మరో ముఖ్యమైన ఆరోపణ ఏమిటంటే, దిగువ భాగంలో ఉన్న సుమారు 350 ఎకరాల సాగుభూములకు నీటిని అందించే పంటకాలువను పూడ్చివేసి, దానిపై ప్రహరీ గోడ నిర్మిస్తున్నారనేది. ఈ కాలువ ద్వారా అనేక సంవత్సరాలుగా రైతులకు సాగునీరు అందుతోందని, ఇప్పుడు దానిని మూసివేస్తే భవిష్యత్తులో తీవ్ర నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "మా పంటలకు ప్రాణాధారం అయిన కాలువను పూడ్చేస్తే వ్యవసాయం ఎలా సాగుతుంది..? ఇప్పటికే వర్షాలు తగ్గిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు కాలువనే మూసేస్తే మా పరిస్థితి ఏమవుతుంది..?" అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. కాలువ పూడ్చివేత వల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహం అడ్డంకులు ఎదుర్కొని సమీప గ్రామాల్లో నీరు నిలిచిపోయే ప్రమాదం కూడా ఉందని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయ భూములకు మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా నష్టం జరుగుతుందని వారు అంటున్నారు.

ఇంతటి వివాదాలు, ఆరోపణలు వెలుగులోకి వస్తున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. గ్రద్దగుంట గ్రామ ప్రజల కోరిక మేరకు వెంటనే పూర్తి స్థాయి భూ సర్వే నిర్వహించాలని, పంచాంగం సర్వేలో మఠం భూములు ఉన్నాయా లేదా అనే అంశాన్ని అధికారికంగా నిర్ధారించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మఠం భూములు అక్రమంగా లేఅవుట్‌లో కలిపి ఉంటే వాటిని తిరిగి గ్రామానికి అప్పగించాలని కోరుతున్నారు. అలాగే పంటకాలువను యథాస్థితికి తీసుకురావాలని, అక్రమ గ్రావెల్ తరలింపులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం తడ మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి నిజానిజాలు వెలుగులోకి తీసుకురాకపోతే భవిష్యత్తులో గ్రామస్తులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.




# ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యవసర సరుకులు అందజేత

**శ్రీకాళహస్తి మే 10 జన సంఘర్షణ:**




పట్టణంలోని నగరివీధి నందు హెల్పింగ్ హాండ్స్ సంస్థ 173 వ నెల కార్యక్రమం భాగంగా ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రతినెల ఉచిత నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత మునిర్ భాష మాట్లాడుతూ.. ఏ కులంలోనైనా ఏ మతంలోనైనా దేవునికి దండం పెట్టేముందు పేదవానికి అంత అన్నం పెట్టు అన్న పరమార్ధాన్ని ఆదర్శంగా తీసుకొని, పేదవానికి అంత సహాయం చేయాలని కోరారు, తీర్థయాత్రలు చేయడం కన్నా తమ ఇంటి ముందు ఉన్నవా పేదవానికి సహాయం అందజేస్తే అదే తీర్థయాత్ర చేసినంత పుణ్యమని కాబట్టి ప్రతి ఒక్కరు పేదలకు సహాయం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. తాను చెప్పే మాటల్ని తాను ఆదర్శంగా తీసుకొని హెల్పింగ్ హాండ్ సంస్థ ద్వారా 173 నెలలుగా ప్రత్యేక ప్రతిభావంతులకు తన షాపు చిల్డ్రన్ ఫాన్సీ స్టోర్ లో అమ్మే వస్తువుల ఆదాయంతో తాను ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, తన సేవకు వెన్నంటూ ఉండే కొనుగోలుదారులు, హెల్పింగ్ హాండ్ సంస్థ సభ్యులు, తన దుకాణంలో పనిచేసే సిబ్బందికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ,వారి రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేనని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గరికిపాటి రమేష్, బాబా ఫరీద్, హరిబాబు, గాంధీ, ప్రత్యేక ప్రతిభావంతులు, హెల్పింగ్ హాండ్ సంస్థ సిబ్బంది, చిల్డ్రన్ ఫ్యాన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లి ప్రజలందరినీ చల్లగా చూడాలి...

**తిరుపతి, మే 10 జన సంఘర్షణ:**



శ్రీ తాతయ్య గుంట గంగమ్మ అమ్మవారు తిరుపతి నియోజకవర్గ ప్రజలందరినీ ఆయురారోగ్య సుఖ సంతోషాలతో ఉండేలా ఆశీర్వదించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు, తిరుపతి కోపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ పి.భువన్ కుమార్ రెడ్డి చెప్పారు. శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని ఆదివారం తన కార్యాలయం ముందు భక్తులకు రాగి అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భువన్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గంగమ్మ జాతరను పురస్కరించుకుని తమ కుటుంబం ప్రజలకు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, అంబలి పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు ఎవరికి అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు పేర్కొన్నారు. ఏడాది అమ్మ దీవెనలతో సకాలంలో వర్షాలు కురిసి రైతులకు పంటలు బాగా పండి లాభాలు గడించేలా చూడాలని ఆకాంక్షించారు.

# కుప్పంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- **కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ పిడి వికాస్ మర్మత్.**

**కుప్పం,మే 10 జన సంఘర్షణ:**
నియోజకవర్గ కేంద్రమైన కుప్పంలో నేడు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఆయన వివరాలు తెలిపారు. కుప్పంలో ఈ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం, కుప్పం అర్బన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.




# అంగన్వాడి పాఠశాలకు కుర్చీలు వితరణ

**కార్వేటి నగరం మే 10 జన సంఘర్షణ**
కార్వేటి నగరం మేజర్ పంచాయతీ చాకలి వాని గుంటలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యులు, మాల కార్పొరేషన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో కుర్చీలను వితరణగా అందజేశారు.ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ చంద్రమౌళి, ఉపాధ్యక్షురాలు సెల్వి, మండల కార్యదర్శి రుద్ర పాల్గొన్నారు

జన సంఘర్షణ



# పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో కలిగి ఉండాలి: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

- ఘనంగా శ్రీ శ్రీ పెద్దమ్మతల్లి ఐదవ వార్షికోత్సవ వేడుకలు.
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.
- వైభవంగా పెద్దమ్మ--పెద్దిరాజుల కళ్యాణం.

**దౌల్తాబాద్ మే 10**

దౌల్తాబాద్ మండల కేంద్రంలో శ్రీ శ్రీ పెద్దమ్మతల్లి ఐదవ వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే శ్రీ కొత్త ప్రభాకర్ రెడ్డి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దమ్మ--పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ఆలయ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించగా భక్తుల రద్దీతో సందడి నెలకొంది. మహిళలు బోనాలు, పూజా సామగ్రితో అమ్మవారికి మొక్కులు చెల్లించారు. వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక సంప్రదాయాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో దౌల్తాబాద్ మండలం మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోలిపేట సతీష్ రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రహీముద్దీన్, పట్టణ అధ్యక్షులు ఉమ్మడి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, పులిమామిడి కిష్టాపూర్ మాజీ సర్పంచ్, సీనియర్ జర్నలిస్టు నాయిని రాజగోపాల్, వార్డ్ సభ్యులు కేంసారం నాగరాజు, మత్స్యకార సంఘం అధ్యక్షుడు కర్రోళ్ల మల్లేష్, ముదిరాజ్ సంఘం నాయకులు గుండెకాయ రాములు, మొద్దు కిష్టయ్య, పద్మిని మల్లేశం, మరికంటి నర్సింలు, తలారి శీను, కర్రోళ్ల నాగరాజు, పోషమైన రాజు, శ్రీనివాస్, చింటు, పద్మిని విజయ్ కుమార్, జాలిగామ శివకుమార్, మొద్దు రమేష్, మొద్దు రాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు, ముదిరాజ్ సంఘం యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





## కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక రూల్స్ దగ్ధం కార్యక్రమం నిర్వహించిన సిఐటియు నాయకులు

**నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలి - బంగారు నర్సింగరావు**





**మేడ్చల్ మాల్కజ్ గిరి బండ్లగూడ, మే 10:**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర మండల పరిధిలోని బండ్లగూడ ప్రాంతంలోని ప్రజయ్ సాయి గార్డెన్ వద్ద కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన OSH, SS, IR కోడ్ల రూల్స్ ప్రతులను దగ్ధం చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కీసర మండల కన్వీనర్ బంగారు నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ఇదే విధంగా కొనసాగిస్తే కార్మిక వర్గం తమ హక్కుల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున తిరుగుబాటు చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే OSH, SS, IR కోడ్లకు సంబంధించిన రూల్స్ను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని వర్గాల కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మైగూడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇ. దేవేందర్, బి. హరి ప్రసాద్, కె. దినేష్, చిన్నూరి మహేష్, చ. మహేష్, బి. ప్రకాష్, కె. సుధాకర్, బి. నాగరాజు, ప్రభాకర్, కె. నాగమణి, కె. లక్ష్మి, డి. లక్ష్మి, ఎస్. శశిరేఖ, పావని, లింగమణి, కళమ్మ, రాణి, శ్యామల, భారతి తదితరులు పాల్గొన్నారు.

## భారీ బహిరంగ సభకు బయలుదేరిన బిజెపి నాయకులు



**నర్వ మే 10**

మండల బిజెపి నాయకులు పేరేడు గ్రౌండ్ లో జరుగుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు. మండల బిజెపి అధ్యక్షులు అజిత సింహారెడ్డి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరిననర్వ మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి భారీగా తరలిన బిజెపి నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు భారీ బహిరంగ సభకు బయలుదేరు

## ఎర్రగడ్డ రైతుబజార్లో ప్లాస్టిక్ సంచుల నిషేధంపై అవగాహన కార్యక్రమం

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి - కోటిరెడ్డి**



**హైదరాబాద్**

ఆదివారం ఎర్రగడ్డ రైతుబజార్లోని కూరగాయలు, పండ్ల మార్కెట్లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిషేధిస్తూ క్లాత్ సంచుల వినియోగంపై యువతకు, కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా క్లాత్ సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ, ప్లాస్టిక్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కూరగాయలు, పండ్లు అమ్మే ప్రతి ఒక్కరి చేతుల్లోనే ఉందన్నారు. పర్యా వరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, క్లాత్ సంచుల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## భారీ బహిరంగ సభకు బయలుదేరిన అలియాబాద్ బీజేపీ నాయకులు



**అలియాబాద్ మే 10**

అలియాబాద్ మున్సిపాలిటీ పరిధి లోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పేరేడు గ్రౌండ్లో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి అలియాబాద్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు కొరివి కృష్ణ, బీజేపీ ఉపాధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో. మున్సి పాలిటీ పరిధి లోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సభకు బయలుదేరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభ




విజయవంతం కావాలని బీజేపీ నాయకులు ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ఐక్యం గా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపు నిచ్చారు.

## వధూవరులను ఆశీర్వదించిన అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గాదె వెంకటేష్



**అలియాబాద్ మే 10**

మేడ్చల్ మాల్కజ్ గిరిజిల్లా అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన వివాహ వేడుకలో మున్సిపల్ కౌన్సిలర్ గాదె వెంకటేష్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా

# కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పరిశీలించారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని కాట్రెవుపల్లి గ్రామం వద్ద ఫేస్ వన్ లో భాగంగా నిర్మిస్తున్న కొడంగల్ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ పనులను అదేవిధంగా కెనాల్ పనులను మంత్రి పరిశీలించారు .ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనుల వివరాలను తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. కొడంగల్ భూములకు కృష్ణాజిల్లాలో అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. పనుల్లో జరుగుతున్న తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూనే పనుల్లో మరింత వేగం పెంచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులతో మంత్రి కాసేపు మాట్లాడారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా రూ. 4750 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ఎత్తిపోతల పూర్తయితే మక్తల్ నారాయణపేట కొడంగల్ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీరు అందనుందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఏడాదిలోగా పొలాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో



ముందుకు సాగుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.మంత్రి వెంబడి కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, బి. గణేష్ కుమార్,మంథన్ గోడ్ సర్పంచ్ కె.రాజేందర్ గౌడ్, నాయకులు వాకిటి హన్మంతు ,కృష్ణయ్య గౌడ్ , చెన్నయ్య గౌడ్,ఇరిగేషన్ ఏఈ నాగశివ ,సిఐ రామ్ లాల్ తదితరులు ఉన్నారు.

# ఈ నెల 11 నుండి డిగ్రీ కళాశాలలో ఎడ్యుకేషన్ వీక్ వేడుకలు

**- కళాశాల ప్రిన్సిపాల్ ఇ. నారాయణ గౌడ్**



**మక్తల్, మే 10**

99 రోజులు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కళాశాల విద్య ఆద్వర్యంలో ఈ 11వతేది నుండి 17వ తేది వరకు ఎడ్యుకేషన్ వీక్ వేడుకలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మక్తల్ లో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇ. నారాయణ గౌడ్ ప్రకటనలో తెలిపారు. ఏడురోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ అభివృద్ధి పనులకు శంకు స్తాపనలు, ప్రారంభోత్సవాలు, వివిధ పరిశ్రమలలో లో యంఒయు లు, పీజీ లు చదివే విద్యార్థులకు ఫ్రీ కోచింగ్ యోగా, మెడిటేషన్ క్లాసులు ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులు, అద్యాపకులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలుపారు.

# క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

**- మక్తల్ సీఐ రామ్ లాల్**



**మక్తల్, మే 10**

ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న నేపథ్యంలో, కొంతమంది యువత తక్కువ సమయంలో, సులువుగా డబ్బులు సంపాదించాలని ఆశించి క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నారని మక్తల్ సీఐ రామ్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు.ఇలాంటి బెట్టింగ్స్ వల్ల యువత ఆర్థికంగా నష్టపోయి, జీవితాలు నాశనం చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో తీవ్ర నిరాశకు గురై తీవ్రమైన నిర్ణయాలకు దారి తీసే ప్రమాదం కూడా ఉందని, దీంతో కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు.క్రికెట్ బెట్టింగ్స్ చట్టరీత్యా నేరమని, ఇందులో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. అలాగే బెట్టింగ్ నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.యువత ఈ మాయలో పడకుండా జాగ్రత్తపడాలని, తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని సీఐ సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, వారి రోజువారీ కార్యకలాపాలను గమనించాలని సూచించారు. మ్యాచ్ల సమయంలో పిల్లల్లో ఏవైనా అనుమానాస్పద మార్పులు గమనిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.క్రికెట్ వంటి ఆటలను వినోదంగా మాత్రమే చూడాలని, వాటిని బెట్టింగ్ల కోసం ఉపయోగించకూడదని అన్నారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.క్రికెట్ బెట్టింగ్కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

**- మాగనూరు ఎస్సై అశోక్ బాబు**







**మక్తల్( మాగనూర్ ), మే 10**

రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా మాగనూరు పోలీస్ స్టేషన్లో మాగనూరు మండలానికి చెందిన హిందూ, ముస్లిం మత పెద్దలతో ఎస్సై అశోక్ బాబు ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పండుగల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, పరస్పర సామరస్యం, అక్రమ కార్యకలాపాల నియంత్రణపై సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా ఎస్సై అశోక్ బాబు మాట్లాడుతూ పండుగలను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఎవరూ ప్రవర్తించరాదని, పరస్పర గౌరవ భావంతో వ్యవహరించాలని కోరారు.బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణా నివారించేందుకు ఉజ్జల్లి బోర్డర్ చెక్పోస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ అక్రమ పశువుల రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని చెప్పారు. అనుమానాస్పద వాహనాలు లేదా వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పండుగల సందర్భంగా నిర్వహించే ఊరేగింపులు, ప్రార్థనలు, ఇతర కార్యక్రమాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి పండుగలను విజయవంతంగా నిర్వహించుకోవాలని కోరారు.ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది, హిందూ మరియు ముస్లిం మత పెద్దలు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి మూడవ మహాసభను జయప్రదం చేయాలి



**తుర్కపల్లి, మే 10**

తెలంగాణ ప్రజా నాట్యమండలి మూడవ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సిల్వేరు దుర్గయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో కళాకారులను నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీని త్యాగ జాను అధ్యక్షతన నిర్వహించారు .ఈ సందర్భంగా సిల్వేరు దుర్గయ్య మాట్లాడుతూ అర్హులైన కళాకారులకి పెన్షన్ ఇవ్వాలని ఐడెంటి కార్డులను ఇవ్వాలని కళాకారులకు హాస్పటల్లో ఉచిత వైద్యం ఇవ్వాలని అన్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి ఈనెల 20వ తేదీన ఆలేరులో జరిగే మూడో మహాసభ జయప్రదం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారుల జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంజా

# డాక్టర్ లక్ష్మణ్ ఆస్తమా & చెస్ట్ క్లినిక్ ప్రారంభించిన తోటకూర వజ్రేష్ యాదవ్

**బోడుప్పల్ మే 10**

మల్కాజ్గిరి కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్, పీరజాదిగూడ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ లక్ష్మణ్ ఆస్తమా & చెస్ట్ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై క్లినిక్ను ప్రారంభించారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు.



Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co